ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 3
సోమవారం 13 జనవరి 2025



బాబు పవర్..!

డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పిన్నాపురం ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక (రెన్యువబుల్) ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ)ను తాజాగా సందర్శించారు. ఇది రాళ్ల సీమలో నిర్మించిన అద్భుతమైన పవర్ ప్రాజెక్టు అని, సీఎం చంద్రబాబు 'గ్రీన్ ఎనర్జీ'కి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పవన్ వివరించారు. పవన్ అటు వెళ్లగానే వైసీపీ నాయకులు తమ అనుకూల మీడియాలో అసత్య కథనాలకు తెరతీశారు. ఈ పవర్ ప్రాజెక్టు వైసీపీ హయాంలో మంజూరైందని, 2002 మే 17న సీఎం హోదాలో వైఎస్ జగన్ ప్రారంభించారని ఈ కథనాల సారాంశం. కానీ అవన్నీ అబద్ధాలేనని తేలిపోయాయి. రాష్ట్ర విభజన తరవాత రాయలసీమ కరువు ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు తీసుకురావాలని అప్పటి సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఆసియాలోనే అతిపెద్ద వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ (సోలార్ పవర్) యూనిట్ ఓర్వకల్లు, గని గ్రామాల మధ్య ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే ప్రప్రథమ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు విశాఖ కేంద్రంగా 2018 ఫిబ్రవరి 24-26 మధ్య జరిగిన 'ఏపీ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2018'లో బీజం వేశారు. అదే ఏడాది పిన్నాపురం-గుమ్మటంతండా గ్రామాల మధ్య సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ (హైడ్రో) పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రీన్‌కో ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (గ్రీన్‌కో గ్రూప్)కు అనుమతులు మంజూరు చేస్తూ జీవో ఎంఎస్ నంబరు.24 జారీ చేశారు. నాలుగేళ్లలో పూర్తి చేసేలా ప్రభుత్వం ఆ కంపెనీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంది. 2019 మేలో ఏర్పడిన జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూడేళ్లు ఆలస్యమైంది.


పంప్డ్ స్టోరేజ్ (హైడ్రో) పవర్ ప్రాజెక్టు


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Energy, Infrastructure & Investment Department – Establishment of India's largest Integrated Renewable Energy Project (IREP) by M/s. Greenko Energies Private Limited consisting of 1000 MW of Solar Power, 550 MW of Wind Power and 1200 MW of Standalone Pumped storage capacities - Approval of overall Integrated Renewable Energy Project (IREP) – Orders – Issued.
ENERGY, INFRASTRUCTURE & INVESTMENT (POWER.II) DEPARTMENT
G.O.Ms.No.24 Dated:19.07.2018
Read the following:


2018 జూలై 19న ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇస్తూ టీడీపీ ప్రభుత్వం జారీ చేసి జీఓ

- చంద్రబాబు హయాంలోనే పిన్నాపురం ఐఆర్ఈ ప్రాజెక్టు
- 4,766.28 ఎకరాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు శ్రీకారం
- 2018 ఫిబ్రవరిలో గ్రీన్‌కోతో ఒప్పందం.. జూలై 19న జీఓ జారీ
- నిర్మాణ సమయంలో 15 వేల మందికి ఉపాధి
- 3 వేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి
- దుష్ప్రచారానికి తెరతీసిన వైసీపీ

కర్నూలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అప్పటి సీఎం చంద్రబాబు ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో పారిశ్రామికవాడ (ఇండస్ట్రియల్ హబ్) ఏర్పాటు చేశారు. ఓర్వకల్లు, గని గ్రామాల్లో ఆసియా దేశాల్లోనే అతిపెద్ద వెయ్యి మెగావాట్ల సామర్థ్యంలో 'అల్ట్రా మెగా సోలార్ పార్క్' నిర్మాణానికి 2015-16 మధ్యలో ఆనాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రీన్‌కో కంపెనీ 500 మెగావాట్లు, స్టాఫ్ బ్యాంక్ ఎనర్జీ సంస్థ 350 మెగావాట్లు, అజూద్ పవర్ కంపెనీ 100 మెగావాట్లు, అదానీ గ్రూప్ 50 మెగావాట్లు సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దాదాపు 24 చదరపు కిలోమీటర్లు ఆ సోలార్ పార్క్ విస్తరించింది. 2017 అక్టోబరు 5 నాటికే దాదాపు 806.072 మిలియన్ యూనిట్లు సోలార్ పవర్ ఉత్పత్తి సాధించి సరికొత్త రికార్డును నమోదు చేశారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో 'జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమ' నిర్మాణానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతోంది. కర్నూలు జిల్లాకు పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు రావాలంటే విమానయాన సౌకర్యం ఉండాలని 1,110 ఎకరాల్లో రూ.110 కోట్లతో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మాణానికి శ్రీకారం చుట్టి కేవలం 18 నెలల్లో పూర్తి చేసి మరో రికార్డును అందుకున్నారు.


● గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం

ప్రపంచంలోనే ప్రప్రథమంగా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ (హైడ్రో) పవర్ ప్రాజెక్టు స్థాపించాలని గత టీడీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు వచ్చిన ఆలోచన. పలు గ్రీన్ ఎనర్జీ కంపెనీలతో పలుమార్లు చర్చించారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్‌లో భాగంగా 2018 అక్టోబరు 24 నుంచి 26 వరకు విశాఖ కేంద్రంగా 'ఏపీ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2018'ను అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించింది. అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్‌ప్రభు, సీఎం చంద్రబాబులు ఈ సమ్మిట్‌ను ప్రారంభించారు. ఆ సమ్మిట్‌లో పిన్నాపురం ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక (రెన్యువబుల్) ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ) నిర్మాణానికి బీజం పడింది. 2,750 మెగావాట్ల సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్‌కో ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (గ్రీన్‌కో గ్రూప్) ప్రతినిధులతో టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మంత్రివర్గం ఆమోదం తరువాత 2,750 మెగావాట్లు (1,000 మెగావాట్లు సోలార్ పవర్, 550 మెగావాట్లు విండ్ పవర్, 1,200 మెగావాట్లు పంప్డ్ స్టోరేజ్ పవర్) ఉత్పత్తి లక్ష్యంతో గ్రీన్‌కో కంపెనీకి పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం హుసేనాపురం, బ్రాహ్మణపల్లి, కాల్వ, గుమ్మటంతండా గ్రామాల్లో మార్కెట్ విలువకు 4,766.28 ఎకరాలు, గోరుకల్లు రిజర్వాయరు నుంచి ఒక టీఎంసీలు నీటిని గ్రీన్‌కో కంపెనీకి కేటాయిస్తూ.. 2018 జూలై 19న జీఓ ఎంఎస్ నంబరు.24ను ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీఓను నాటి విద్యుత్ శాఖ, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్‌జైన్ జారీ చేశారు. 2,750 మెగావాట్ల నుంచి తరువాత 5,230 మెగావాట్లకు పెంచారు. నిర్మాణ సమయంలో 15 వేల మందికి, ప్రాజెక్టు ప్రారంభమైన తరువాత 3 వేల మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలి. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును నాలుగేళ్లలో అంటే 2022 ఆఖరీలోగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో కంపెనీకి కేటాయించిన మొత్తం భూమిని వెనక్కి తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసి ఆ వెంటనే పనులు మొదలు పెట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేసిన గ్రీన్‌కో కంపెనీ వివిధ నిర్మాణాలు పూర్తి చేసింది.



● జగన్ హయాంలో నిర్లక్ష్యం

2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో పిన్నాపురం ఐఆర్ఈసీ ప్రాజెక్టుకు శాపంగా మారింది. అప్పటికే జోరుగా సాగుతున్న పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గ్రీన్‌కో గ్రూప్ యాజమాన్యం పలుమార్లు వైసీపీ ప్రభుత్వ పెద్దలను కలసినా పనులు ప్రారంభించేందుకు మొదట్లో అనుమతి ఇవ్వలేదు. ఎట్టకేలకు ఈ ప్రాజెక్టును కొనసాగించేందుకు జగన్ ప్రభుత్వం ఒప్పుకుంటూ ఉత్తర్వులు ఇవ్వడంతో గ్రీన్‌కో కంపెనీ పనులను పునఃప్రారంభించింది. 2022 మే 17న నాటి సీఎం జగన్ సిమెంట్ పనులకు శంకుస్థాపన చేశారు. టీడీపీ ప్రభుత్వంలోనే గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని తరలించే కాలువ, లోయర్ రిజర్వాయర్, అప్పర్ రిజర్వాయర్, పవర్ హౌస్ నిర్మాణం మట్టి పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కూడా యథావిధిగా పనులు కొనసాగించి ఉంటే ఒప్పందం మేరకు 2022 ఆఖరు నాటికి పనులు పూర్తి జరిగి విద్యుత్ ఉత్పత్తి మొదలయ్యేది. జగన్ నిర్లక్ష్యం వల్ల మూడేళ్ల జాప్యం జరిగింది.


హైడ్రో పవర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

● చంద్రబాబు విజన్‌కు నిదర్శనం



సీఎం చంద్రబాబు విజన్ వల్లే పిన్నాపురం ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక (రెన్యువబుల్) ఎనర్జీ ప్రాజెక్టు ఓర్వకల్లులో ఏర్పాటైంది. 2014లో రాష్ట్ర విభజన తరువాత నాటి సీఎం చంద్రబాబు గ్రీన్ ఎనర్జీకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద వెయ్యి మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పార్క్‌ను ఓర్వకల్లు కేంద్రంగా ఏర్పాటు చేశారు. 2018లో 5,230 మెగావాట్ల సామర్థ్యంతో ఐఆర్ఈసీ ప్రాజెక్టుకు గ్రీన్‌కో కంపెనీతో చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ వెంటనే జీఓ ఇచ్చి పనులు కూడా ప్రారంభించారు. వాస్తవాలను వక్రీకరించి ఇది జగన్ తీసుకొచ్చిన ప్రాజెక్టు అంటూ బ్లూ మీడియా, కొందరు వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టుకు ఎన్నో ఇబ్బందులు సృష్టించారు.

– టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, కర్నూలు

సంక్రాంతి శోభ

- నేడు భోగి వేడుక



కర్నూలు కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హిందూ మత విశ్వాసాల ప్రకారం సూర్యభగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని మకరసంక్రాంతి అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. సోమవారం రోజున భోగి పండుగకు ప్రజలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు వేసి, అందులో పాత వస్తువులు కాల్చివేస్తారు. గత స్మృతులకు సెలవు పలికి, నవ్యతతో కూడిన జీవితాన్ని ఈ వేడుక నుంచి ప్రారంభించాలని, భోగి మంటల ద్వారా నవ్య క్రాంతిని అందుకోవాలనే అర్థం ఇందులో ఇమిడి ఉంది. భోగిపండుగ రోజున పిల్లలకు రేగుపండ్లు, పూలతో తలమీద పోస్తారు. ఇందువల్ల ప్రకృతి నుంచి సంభవించే ఎలాంటి కీడు తమ పిల్లలపై పడకూడదని తల్లిదండ్రులు భోగి మంటల వద్ద దైవాన్ని ప్రార్థిస్తారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

ఇళ్లలోనే పండుగ జరుపుకోండి

- హెచ్‌ఎంపీవీ కేసుల దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు





కర్నూలు హాస్పిటల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో హెచ్‌ఎంపీవీ కేసుల సంఖ్య 17కి చేరాయి. హెచ్‌ఎంపీవీ కేసులు మెల్లమెల్లగా ఎక్కువ కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైరస్ నేపథ్యంతో సంక్రాంతి పండుగను అందరూ ఇళ్లలోనే ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ విషయంలో భయపడాల్సిన పని లేదని, రద్దీ ఉన్న ప్రాంతాలు, జన సమూహాల్లోకి వెళ్లేటప్పుడు తప్పక మాస్కులు ధరించాలన్నారు. చేతులు శుభ్రంగా చేసుకోవాలని, జలుబు, దగ్గు, ఆస్తమా, ఆయాసం, న్యూమోనియా వంటి శ్వాస సంబంధిత జబ్బులున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. హెచ్‌ఎంపీవీ వైరస్ కొత్తది కాదని, పాతదేనని, ప్రాణాపాయం ఉండదని వెల్లడించారు. కొవిడ్ ముందస్తు జాగ్రత్తల మాదిరిగానే చేతులను తరచూ సబ్బుతో కనీసం 20 సెకన్లు కడుక్కోవాలని అన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో ముందస్తు చర్యలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఓల్డ్ గైనిక్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామన్నారు. అలాగే మరో పది పడకలను నెగిటివ్ ప్రెజర్ రూంలో సిద్ధం చేస్తున్నామన్నారు.

భక్తుల చెంతకు 'భగవంతుడు'

- 15 నుంచి అహోబిలం పార్వేట ఉత్సవాలు
- తన వివాహానికి ఆహ్వానిస్తూ భక్తుల వద్దకు లక్ష్మీ నృసింహుడు
- 45 రోజుల పాటు 32 గ్రామాల్లో శ్రీవారి పర్యటన
- 600 ఏళ్లుగా కొనసాగుతున్న ఆచారం



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని నవనారసింహ క్షేత్రాల్లో ఒక్కటైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. అత్యంత శక్తివంతుడైన నారసింహస్వామి ప్రతి ఏటా మండలం రోజుల పాటు గ్రామాలబాట పడతారు. నల్లమల కొండల్లో కొలువైన నారసింహుడు తన కల్యాణానికి రావాలంటూ భక్తులందరినీ స్వయంగా తానే ఆత్మీయంగా ఆహ్వానం పలుకుతారు. ఈ ఆత్మీయ ఆహ్వాన యాత్రలో భాగంగా శ్రీవారు భక్త ప్రహ్లాదుడితో కలిసి 41 రోజుల పాటు 33 గ్రామాల్లో పర్యటిస్తారు. చెంచులక్ష్మితో తనకు జరగబోయే కల్యాణానికి హాజరు కావాలంటూ గ్రామ గ్రామాన పర్యటన చేసే పార్వేట ఉత్సవం సంక్రాంతి మరుసటి రోజు 15వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. దాదాపు 600 సంవత్సరాల నుంచి ఈ అపురూప ఆచారం కొనసాగుతోంది. ఏటా మకర సంక్రాతి పర్వదినాన ఎగువ అహోబిలంలోని జ్వాలా నరసింహ స్వామి పల్లకిలో కొలువై గర్భగుడి నుంచి వెలుపలికి వేంచేసి దిగువ అహోబిలం చేరుకుంటారు. అక్కడ జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఒకే పల్లకిలో కొలువుదీరుతారు. ఉత్సవ పల్లకి పార్వేటకు బయలుదేరే ముందు స్వామివార్లకు ఎదురుగా అన్నం రాసిగా పోసి అన్నకూటోత్సవం, కుంభహారతి నిర్వహిస్తారు. 45 రోజుల పాటు కొనసాగే పార్వేట ఉత్సవాల్లో స్వాములకు సరిపడే ఆహారాన్ని ఇద్దరు ఉత్సవమూర్తులకు నివేదిస్తారు. అనంతరం ఒకే పల్లకిలో కొలువైన స్వామివార్ల పల్లకికి చెంచులు పూజలు నిర్వహించి బాణాలు సంధించడంతో పార్వేట మహోత్సవం ప్రారంభమవుతుంది.

మిగతా 5లో...

వివేకాను విస్మరించారు..!



గత ఏడాది జనవరి 12న వివేకానందుని విగ్రహానికి అలంకరణ చిత్రం ఇది.


ఆదివారం బోసిగా కనిపిస్తున్న వివేకానందుని విగ్రహం

కర్నూలు కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం స్వామి వివేకానందుని జయంతిని జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించి, యువతకు సంబంధించిన అనేక కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. కానీ జిల్లా యంత్రాంగం మాత్రం ఈ ఏడాది ఆయన జయంతిని పూర్తిగా విస్మరించింది. నగరంలోని రాజ్ విహార్ కూడలిలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందుని విగ్రహానికి కనీసం అలంకరణ కూడా చేయలేదు. జయంతి వేడుకలకు అధికార యంత్రాంగం, యువజన సర్వీసుల శాఖకానీ, కలెక్టర్ కానీ హాజరు కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిఏటా జయంతి వేడుకను ప్రభుత్వమే నిర్వహించేదని, ఈ ఏడాది పూర్తిగా విస్మరించి ఆ మహనీయునికి అవమానం చేశారని కర్నూలు సివిల్ ఫోరం అధ్యక్షుడు, బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ కొట్టే చెన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

భృంగి వాహనంపై శ్రీశైలేశుడు

- బ్రహ్మోత్సవాల సందడిలో శ్రీగిరి
- ఉత్సవం ఎదుట చెంచుల కోలాహలం

శ్రీశైలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పంచాహ్నిక దీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో రెండో రోజు ఆదివారం లోకకళ్యాణం కోసం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లుకు భృంగివాహన సేవ నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చి పురవీధుల్లో గ్రామోత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, డమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకున్నాయి. మూడో రోజు సోమవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు కైలాసవాహన సేవ నిర్వహిస్తారు.


భృంగివాహనంపై విహరిస్తున్న ఆదిదంపతులు





భక్తుల చెంతకు భగవంతుడు



ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ (ఫైల్)

(3వ పేజి తరువాయి)

45 రోజులు.. 32 గ్రామాల్లో..

హిరణ్య కశిపుడిని వధించిన తర్వాత మహావిష్ణువు ఉగ్రరూపంతోనే అడవుల బాట పడతారు. ముక్కోటి దేవతలు ప్రార్థించినా నరసింహ రూపం వీడలేదు. అడవుల్లో చెంచు లక్ష్మి చేతి స్పర్శతో శాంతించి నరసింహస్వామి ఆమెనే వివాహమాడారు. అందుకే ఆలయం నుంచి శ్రీవారు ప్రతి ఏటా మండలం రోజులు బయల్దేరి స్వయంగా 'కల్యాణానికి రండి..' అని ప్రజలను ఆహ్వానిస్తారు. అహోబిలేశుడి పార్వేట పల్లకి నియోజకవర్గంలోని ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లోని 32 గ్రామాల్లో 45 రోజులపాటు కొనసాగుతుంది. గ్రామాల్లో ఆనవాయితీగా వస్తున్న తెలుపులను ప్రత్యేకంగా అలంకరించి స్వామివార్ల ఉత్సవ పల్లకిని కొలువుంచి భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తారు. ఈ నెల 15వ తేదీన దిగువ అహోబిలం నుంచి ప్రారంభమయ్యే పార్వేట ఉత్సవం మొదట ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామానికి చేరుకుంటుంది. చివరగా ఫిబ్రవరి 27వ తేదీ రాత్రి ఉత్సవ పల్లకిని రుద్రవరం నుంచి గండ్లేరు దగ్గర రహదారిపైకి తీసుకువస్తారు. అక్కడ ఉదయం వరకు స్వామివార్లు సేద తీరుతారు. 28వ తేదీ ఉదయం స్వామివారి పల్లకి దిగువ అహోబిలంలోని మఠంకు చేరుకుంటుంది. అనంతరం పల్లకిని ఆలయ ప్రదక్షిణగా గర్భగుడి సమీపంకి తీసుకొస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం అక్కడ సంప్రోక్షణ నిర్వహిస్తారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కలిగిన దోషాల ప్రాయశ్చిత్తం కోసం 108 కళశాలతో అభిషేకం, లఘు సంప్రోక్షణం, కుంభప్రోక్షణ నిర్వహించి గర్భాలయంలోకి తీసుకొస్తారు. అదేరోజు సాయంత్రం జ్వాలా నరసింహస్వామి ఎగువ అహోబిలం చేరుకుంటారు. అనంతరం ఫాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఏకాదశి పర్వదినాన ఎగువ అహోబిలంలో, ద్వాదశిన దిగువన స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవ వేడుకలను కన్నులపండువగా నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు.

ఆచార వ్యవహారాలకు ప్రతీక



అహోబిలం పార్వేట ఉత్సవం ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచింది. దేవుడు స్వయంగా కొండ దిగి భక్తుల వద్దకు వెళ్లి దర్శనమిచ్చే విశేషమైన ఆచారం అహోబిలంలో మాత్రమే ఉంది. దుష్ట రక్షణ, శిష్ట రక్షణ, లోక కల్యాణార్థం జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి పల్లకిలో కొలువై ఊరూరా పర్యటిస్తారు. ప్రజలు పార్వేట ఉత్సవాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తారు. స్వామివార్ల ఉత్సవ పల్లకికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలుకుతారు.

- కిడాంబి వేణుగోపాలన్, ఆలయ ప్రధాన అర్చకుడు, అహోబిలం



విల్లంబులు చేతబట్టి సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు

వీఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పోలీస్ కానిస్టేబుల్ ఉమా మహేష్

నంద్యాల క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్న వీఆర్ కానిస్టేబుల్ ఉమా మహేష్ ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఉమామహేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన స్థానికులు వెంటనే ఆయనను నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఐదు నెలలు గడుస్తున్నా పోస్టింగ్ ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు విశ్వసనీయం సమాచారం.

15న వాతావరణ విభాగ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న వాతావరణ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్నామని కర్నూలు వాతావరణ కేంద్ర అధికారి పి. ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ విభాగం ఏర్పాటు చేసి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నగరంలోని బిర్లా కూడలి సమీపంలో ఉన్న భారత వాతావరణ కేంద్రాన్ని ప్రజలు సందర్శించే అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 14, 15 తేదీల్లో వాతావరణ కేంద్రం పనిచేసే విధానం తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఔత్సాహిక ప్రజలు తమ కేంద్రాన్ని సందర్శించి, వాతావరణ విశేషాలను, వివిధ పరికరాల పనితీరును తెలుసుకోవచ్చని పి. ప్రభాకర్ వివరించారు.

జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌కు ఆర్‌యూ వీసీ

కర్నూలు అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరుగుతున్న అలిండియా యూనివర్సిటీస్ సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌కు రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ హాజరయ్యారు. ఉన్నత విద్య భవిష్యత్‌ను రూపొందించడంలో భారతదేశ పాత్ర గురించి చర్చించడానికి దక్షిణ భారత విశ్వవిద్యాలయాల వీసీల భేటీలో తమ ఆలోచనలను పంచుకున్నారు. ఈ కాన్ఫరెన్స్ రెండు రోజుల పాటు కొనసాగుతుందని వీసీ తెలిపారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అలనాటి జ్ఞాపకాల తలపోత

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరుటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దశాబ్దాల తర్వాత కలసి అలనాటి అనుభూతులను తలపోసుకున్నారు. మధ్య వయస్సులోకి, వృద్ధాప్యంలోకి వచ్చిన పూర్వ విద్యార్థులు తాము చదివిన విద్యా సంస్థ 77 వసంతాల సందర్భంగా కలుసుకున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఉద్వేగాలతో ఆదివారం ఆ ప్రాంగణమంతా వెల్లువెత్తింది.

- ఉద్వేగభరితంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఎమ్మిగనూరు పాఠశాల, కళాశాల 75 వసంతాల సందడి

ఎమ్మిగనూరు పట్టణంలో 75ఏళ్ల క్రితం ఆవిర్భవించిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు పాఠశాల, కళాశాలలో చదివి దేశవిదేశాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందు పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున కళాశాల నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి చేనేత పిత పద్మశ్రీ మాచాని సోమప్పకు పూలమాలలు వేసి నివాళి అర్పించి బాణసంచా పేల్చారు. వేడుకలకు హాజరైన ప్రముఖులు పారిశ్రామికవేత్త ఎమ్మార్ గంగాధర్, మాచాని జగదీష్, మాచాని రఘునాథ్, కేఎస్‌పీ శివన్న, ప్రముఖ రాజకీయనాయకుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, డీఆర్‌డీవో శాస్త్రవేత్త యుగంధర్, రిటైర్డు ఐజీ నరసింహారెడ్డి, నలంద విద్యాసంస్థల అధినేత మహానందయ్య, వైష్ణవి కళాశాలల అధినేత గడిగెలింగప్ప, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుతో పాటు పలువురు ప్రముఖులను వేదికపైకి పిలిచి ఘనంగా సన్మానించారు. అంతకు ముందు తమకు విద్యనేర్పిన గురువులకు పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువలు కప్పి ఘనంగా సన్మానించి పాదాభివందనాలు చేశారు. ఈ సందర్భంగా కొంతమంది పూర్వ విద్యార్థులు తమ పాఠశాల, కళాశాల అభివృద్ధికి విరాళాలను ప్రకటించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ప్లాటీనంజూబ్లీ వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు

ఇలాంటి వేడుక ఐదేళ్లకు ఒకసారి చేస్తే బాగుంటుంది



1980-82 మధ్య కాలంలో ఈ కళాశాలలో చదివాను. వివాహం తర్వాత ప్రొద్దుటూరులో స్థిర పడ్డా. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిపితే బాగుంటుంది.

- సుచిత్రకుమారి, ఉపాధ్యాయురాలు, ప్రొద్దుటూరు,

ఈ కళాశాల నాకు నాయకత్వ లక్షణాలు నేర్పింది



ఈ కళాశాల నాకు నాయకత్వ లక్షణాలు నేర్పింది. అందువల్లే నేను ఈరోజు రాజకీయ రంగంలో రాణిస్తున్నాను.

- పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మిగనూరు

ఇలా వస్తానని అనుకోలేదు..



దాదాపు 60ఏళ్ల క్రితం చదివిన మా పాఠశాల, కళాశాలకు మళ్లీ ఇప్పుడు రావడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. నేను చదివిన పాఠశాలకు మరలా ఇలా వస్తానని ఎన్నడూ అనుకోలేదు.

- నరసింహారెడ్డి, రిటైర్డు ఐజీ

క్రమ శిక్షణతోనే ఈ స్థాయికి చేరుకోగలిగాను



మేము చదువుతున్న ఆ కాలంలో ఎంతో నాణ్యమైన విద్య మాకు అందింది. టీచర్లు క్రమశిక్షణ నేర్పించడం వల్ల ఈ స్థాయికి రాగలిగాను.

- ఎమ్మార్ గంగాధర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త, నెల్లూరు

నా గురువుల వల్లే..



నేను 1982 నుంచి 87 వరకు ఈ పాఠశాలలోనే చదివాను. గురువులు నేర్పిన విద్య వల్లనే ఈ స్థాయికి ఎదిగాను.

- డాక్టర్ యుగంధర్, డీఆర్‌డీవో శాస్త్రవేత్త, హైదరాబాదు

ఆనందంగా ఉంది



40ఏళ్ల క్రితం ఈ పాఠశాలలో చదువుకున్నా. ఎక్కడో పులివెందులలో స్థిరపడిపోయినా ఇన్నేళ్లకు అందరం కలుసుకోవడం ఆనందంగా ఉంది.

- వసంత, ప్రైవేటు పాఠశాల హెచ్.ఎం. పులివెందుల

హైవేలో దొంగతనం

- వాహనంపై ఉన్న 12 బ్యాగులు, రూ.70 వేలు అపహరణ
- పోలీసులకు భక్తుల ఫిర్యాదు

మహానంది, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వాహనంపై ఉన్న 12 బ్యాగులు, అందులో ఉన్న రూ.70 వేలు శనివారం తెల్లవారుజామున కడప- కర్నూలు హైవేలో చోరీకి గురైనట్లు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నాగూరు ప్రాంతానికి చెందిన అయ్యప్ప భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. కేరళ అయ్యప్ప స్వామి యాత్రలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన బాబుల్‌రెడ్డితో పాటు మరో 10 మంది ఒక వాహనాన్ని అద్దెకు తీసుకొని ఈనెల 5 వతేది బయలు దేరారు. యాత్రల్లో భాగంగా తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు నుంచి శుక్రవారం తిరుగు పయనమయ్యారు. అయితే మహానంది క్షేత్రాన్ని దర్శించాలనే ఉద్దేశంలో భాగంగా శనివారం తెల్లవారుజామున కడప- కర్నూలు హైవే మీదుగా క్షేత్రానికి చేరుకొన్నారు. ఆలయం ముందు భాగంలో భక్తులు వాహనం నిలుపుకొని నిద్రకు ఉపక్రమించారు. ఉదయం నిద్ర లేచి చూడగా వాహనంపై ఉన్న బ్యాగులు లేవని గుర్తించారు. భక్తులు మహానంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కానిస్టేబుల్ శేషన్న ఘటనా స్థలాన్ని, పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వాహనంపై భాగంలోని బ్యాగులు మహానందికి వచ్చే సరికే చోరీకి గురైనట్లు నిర్ధారించారు. భక్తుల ప్రయాణ విషయాలను సేకరించారు. తాము కడప నుంచి హైవే మీదుగా వచ్చామని, మార్గమధ్యంలోని చాగలమర్రి వద్ద కొద్దిసేపు ఆపి విశ్రాంతి తీసుకొన్నట్లు చెప్పారు. తిరిగి ప్రయాణించేటప్పుడు వాహనంపై తమ బ్యాగులను గమనించలేదని చెప్పారు. అక్కడే చోరీ జరిగి ఉండవచ్చని అనుమనాలను భక్తులు వ్యక్తం చేశారు. బ్యాగుల్లో రూ.70 వేల నగదుతో పాటు కొత్త దుస్తులు ఉన్నట్లు చెప్పారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా గత 10 రోజుల క్రితం మహానందికి దర్శనం కోసం వచ్చిన భక్తుల బస్సులోని వాహనం వెనుక వైపు క్యాబిన్‌లో ఏర్పాటు చేసుకొన్న బ్యాగులను కడప హైవేలో క్యాబిన్ బోల్టను పెకిలించిన చోరీ చేసిన ఘటన మరువక ముందే మరోసారి బ్యాగులు చోరీకి గురికావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైవేలో చోరీలపై పోలీసులు నిఘా ఉంచి భక్తుల సొమ్ముకు భద్రత కల్పించాలని కోరారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

కర్నూలు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడి కిడ్నాప్ కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. పోలీసులు బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి ఆదివారం బాలుడిని అప్పగించారు. ఢిల్లీకి చెందిన అజిత్ రాథోడ్, ఆశా దంపతులు కర్నూలు-కోడుమూరు శివారులో గుడిసెలు వేసుకుని రోడ్డుపై బొమ్మలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 20న అర్ధరాత్రి గుడిసెలో నిద్రిస్తుండగా.అజిత్, ఆశా దంపతుల 8 నెలల చిన్న కొడుకు ఆకాష్ రాథోడ్ కనిపించకుండాపోయాడు. దీంతో వారు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల ఇంటికి క్షేమంగా చేరాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో కిడ్నాప్ చేసిన వారు తమ గుట్టు బయట పడుతుందనే భయంతో బాలుడిని తల్లిదండ్రుల వద్దనే వదిలి పరారైనట్లు తెలుస్తోంది. పరారైన నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ఆళ్లగడ్డ, హొళగుంద మండలాల్లో ఘటనలు



మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా(ఫైల్)



గోవింద రెడ్డి(ఫైల్)

ఆళ్లగడ్డ (శిరివెళ్ల)/హొళగుంద, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కర్నూలు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నంద్యాల జిల్లాలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ సమీపంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో ఆళ్లగడ్డ మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకుడు సుద్దపల్లె చాంద్‌బాషా దుర్మరణం చెందారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన సుద్దపల్లె చాంద్‌బాషా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బంధువుల వివాహానికి హాజరై తన ద్విచక్రవాహనంపై స్వగ్రామమైన కోటకందుకూరుకు తిరిగి వెళ్తుండగా ఆళ్లగడ్డ నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ సడన్‌గా ఎడమవైపుకు తిప్పారు. దీంతో వెనుక వస్తున్న చాంద్‌బాషా ద్విచక్రవాహనం ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో చాంద్‌బాషా తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చాంద్‌బాషా తమ్ముడు మదార్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు తెలిపారు.

- కర్నూలు జిల్లా హొళగుంద శివారులోని మార్లమడికి వెళ్లే దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలివీ.. మండలంలోని ముద్దటామాగి గ్రామానికి చెందిన గోవింద్ రెడ్డి (44) ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామం నుంచి హొళగుందలోని ఓ రైస్ మిల్లులో పని నిమిత్తం ఆటో తీసుకొని బయలుదేరారు. అయితే హొళగుంద శివారులో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక వైపు నుంచి ఆటో ఢీకొట్టారు. గోవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య సుమిత్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల నరసింహులు తెలిపారు.

శాస్త్రీయ కళలను ప్రపంచానికి చాటాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీ య కళల విశిష్టతను కళాకారులు ప్రపంచానికి చాటి చెప్పాలని రాజ్య సభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మూడు రోజులుగా నగ రంలోని టీజీవీ కళా క్షేత్రంలో, కర్నూలులోని నటరాజ నృత్య కళా మందరం, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో 'కళా సౌరభ 10వ వార్షికోత్సవం-2025' పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలు, బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇక్కడి హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు కలిసిమెలసి జరుపుకుంటారని, ఇదే సంప్రదాయాన్ని ముస్ముందు కూడా కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. పోటీల్లో విజేతలైన కళాకారులుకు ఆయన బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య, నృత్య గురువు కరీముల్లా, నాట్యాచార్యులు ఎం.సంతోష్, జక్కా శ్రీకృష్ణ, పట్నం శివప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, ఇల్లూరు లక్ష్మయ్య, చంద్రశేఖర్, సునీత పాల్గొన్నారు.



జాతీయ స్థాయి నృత్య పోటీల విజేతలతో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, పత్తి ఓబులయ్య తదితరులు

కాంపౌండ్ వాల్ సమస్యపై వినతి


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న గోరంట్ల సర్పంచ్

కోడుమూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల జడ్పీ, గురుకుల పాఠశాలలకు కాంపౌండ్ వాల్ సమస్య పరిష్కరించాలని సర్పంచ్ సద్దల బాలక్రిష్ణ, విద్యా కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జడ్పీ పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని అన్నారు. అలాగే గురుకుల పాఠశాల పొలాల మధ్యన ఉండడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయని తెలిపారు. గతంలో ఓ విద్యార్థి బహిర్భూమికి పొలాల వైపు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయన్నారు. అలాగే పాఠశాల మెయిన్ గేటు నుంచి దెబ్బతిన్న సీసీ రోడ్డును నూతనంగా నిర్మించాలని కోరారు. దీంతో సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బాలమద్దిలేటి, సభ్యులు బలరాం, ఎర్రమల, మద్దయ్య పాల్గొన్నారు.

కురువలు చైతన్యవంతులు కావాలి: ఎంపీ


కురువ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కురువలు చైతన్యవంతులు కావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలులోని తన కార్యాలయంలో ఆదివారం కల్లూరు మండల కురువ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాగరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి వెలుగులు నింపాలి

కర్నూలు అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు, అధికారులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

ఇంటింటా కొత్త కాంతులు వెల్లివిరియాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు, నగర పాలక మేయర్ బీవై రామయ్య, కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాత నిర్బంధపు చీకట్లుపోయి కొత్త కాంతులు ఇంటింటా వెల్లివిరియాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. భాగ్యాలను అందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను నగర ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

కేంద్ర కార్యాలయాన్ని కొనసాగించాలి

ఓర్వకల్లు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని కొనసాగించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వెనుకబడ్డ రాయలసీమలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయం ఉందని అన్నారు. ఇలాంటి కేంద్ర కార్యాలయాన్ని కడప నుంచి తరలించాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. దేశంలోనే వెనుకబడ్డ రాయలసీమలో మరిన్ని కేంద్ర కార్యాలయాలు, పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సింది పోయి ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదని మండిపడ్డారు. కడపలో కొనసాగించకపోతే భారీ ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగన్న, మధుసూదన్, సుధాకర్, మల్లేష్, నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం


హరిహర క్షేత్రంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): హరిహర క్షేత్రంలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 8 వరకు నిర్వహిస్తున్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు' విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలో సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో నగర బ్రాహ్మణ సంఘం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో చల్లా నాగరాజ శర్మ, కంచుగంటల శ్యామసుందర్‌రావు, నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాదరావు, చెరువు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వై కొట్టాలలో హుండీ అపహరణ

సి.బెళగల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల కొట్టాల గ్రామంలో వెలసిన ఉరుకుంద ఈరన్నస్వామి, ఈదమ్మ దేవాలయాల్లోని హుండీని, గుడి ముందు ఉన్న 5 గంటలు, వెండితో తయారు చేసిన దేవుని కండ్లు, మీసాలను దుండగు లు ఎత్తుకెళ్లినట్లు పూజారి నాగమద్దిలేటి తెలిపారు. రెండు రోజుల క్రింత కోడుమూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు గుడి ఆవరణలో సంచరించి వెళ్లారని, అంతా చూసుకుని పోయిన మరుసటి రోజు దొంగతనం చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఎస్ఐ తిమ్మారెడి కేసు నమోదు చేశారు.


స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

యువతకు స్ఫూర్తి ప్రదాత

స్వామి వివేకానందుని సేవలను కొనియాడిన ప్రముఖులు


స్వామి వివేకానంద విగ్రహం ముందు మాట్లాడుతున్న వక్తలు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి అని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ అనుసరించాలని ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక బీ క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో వివేకానందును చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద దేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి అన్నారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికార్జున, తిప్పన్న, జూనియర్ అసిస్టెంట్ వెంకట్రాముడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వివేకానంద కేంద్రం ప్రతినిధులు

వివేకానంద విగ్రహానికి పూల మాలలు

రాజ్‌విహార్ సర్కిల్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి కురువలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు గుడిసె శివన్న మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రపంచానికి సనాతన భారతీయ సంస్కృతి సంప్రదాయాల గొప్పత నాన్ని తెలియపరి చిన మహానుభావులు అని అన్నారు. వివేకానందను యువకులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, సహాయ కార్యదర్శులు బీసీ తిరుపాలు, దేవేంద్ర, పెద్దపాడు పుల్లన్న, నగర అధ్యక్షులు తౌడు శ్రీనివాసులు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

హరిజోన్స్ ఇంటర్నేషనల్‌లో..

స్థానిక సోమిశెట్టినగర్‌లోని హరిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో చైర్మన్ ప్రదీప్ కుమార్, డా.పావని ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను చిన్నారులకు చిన్న కథలుగా వివరించి బోధిస్తున్నామని తెలిపారు.

● **కర్నూలు రూరల్:** కర్నూలు మండలం దిన్నెదేవరపాడు, బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న విజ్ఞానపీఠం పాఠశాల, విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద 162 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి పీపీ గురుమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలతో నివాళర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివేకానందుని జీవిత ఆశయాలు, ఉన్నత విలువలతో నేటి యువత ముందుకు వెళ్లాలని అన్నారు. అమరావతి సెక్రటరేట్ సెక్షన్ ఆఫీసర్ లింగారెడ్డి, కల్లూరు మండల ఎంపీడీవో నాగేశా చలరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. వివేకానంద జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన క్రీడా విజేతలకు కోడుమూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన సేవా సమితి అధ్యక్షులు ఎస్.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెలుగుల సుంకన్న విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానందుని మాటలు తారక మంత్రాలు

కర్నూలు న్యూసిటీ: స్వామి వివేకానందుని మాటలు తారక మంత్రాలుగా భావించి స్వశక్తితో ఎదిగే ప్రయత్నం చేస్తే యువత దేశానికి విలువైన సంపదగా నిలుస్తారని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. ఆదివారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక రాజ్‌విహార్ కూడలిలోని స్వామి వివేకాంద విగ్రహానికి కమిషనర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.దేశాభివృద్ధికి యువత పాటుపడాలని, ఆయన మార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని అన్నారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శం

కర్నూలు స్పోర్ట్స్: స్వామి వివేకానంద జీవితాన్ని ప్రతి ఒక్కరూ యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఎస్పీ మహబూబ్ బాషా, సెట్కూరు సీఈవో దీప్తి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పేర్కొన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని స్థానిక రాజ్‌విహార్ సర్కిల్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవించింది 39 ఏళ్లయినా ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారని, దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పారని అన్నారు. స్వామి వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు కృషి చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటూ స్వామి వివేకానంద సేవలను స్మరించుకుంటున్నామని చెప్పారు.

కర్నూలు కల్చరల్: భారతీయ సంస్కృతికి సంప్రదాయాలకు నిలువెత్తు రూపమే స్వామి వివేకానందుడు అని సహాయ గ్రంథాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం స్వామి వివేకానందుని జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివేకానందుని చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే రాజ్ విహార్‌లోని స్వామి వివేకానందుని విగ్రహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్ ఏపీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: సమాజక పురోగతికి పాటుపడటమే స్వామి వివేకానంద సమర్పించే నిజమైన నివాళి అని రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు అన్నారు. రాయలసీమ యూనివర్సిటీలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో...

కర్నూలు కల్చరల్: వివేకానందుని జయంతిని ఏటా నిర్వహించే వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేంద్రం అధ్యక్షులు జి.పుల్లయ్య, కార్యదర్శి శివప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ కొట్టే చెన్నయ్య, ఇతర సభ్యులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు కె. శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, పీబీవీ సుబ్బయ్య, రమణ, రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానందుని జయంతి వేడుకల తీరుపై అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరిని వారు తీవ్రంగా ఖండించారు.


పూలమాల వేస్తున్న రాయపాటి శ్రీనివాసులు


హరిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లేస్కూల్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భక్తి శ్రద్ధలతో 'తిరుమంజన' సేవ

కర్నూలు కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి చౌరస్తాలో ని వై జంక్షన్ సమీపంలోగల వాసవీ నగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. నిత్య పూజాది కార్యక్రమాలు, తిరుప్పావై, విష్ణు సహస్రనామ పారాయణ పఠనాలు కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారికి, గోదా దేవి సమేత శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవ మూర్తులకు నవ కలశ స్నప్న 'తిరుమంజన' సేవను వైభవంగా నిర్వహించారు. అలాగే నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో వెలసిన భరతమాత ఆలయంలోని శ్రీదేవి భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవా రికి తిరుమంజన సేవ నిర్వహించారు.

జోహరాపురంలో బ్యాడ్మింటన్ టోర్నమెంటు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జోహరాపురంలోని జేజే షటిల్ క్లబ్‌లో 40 ప్లస్ డబుల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటును ఆదివారం క్లబ్ డైరెక్టర్ జాన్ జాకబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 40+ విభాగంలో విజేతలుగా మొదటి స్థానంలో డోన్ సుమన్, రషీద్‌లు నిలిచారు. రన్నర్స్‌గా అనూష, బాలాజీ, మూడో స్థానంలో శ్రీకాంత్, రామకృష్ణలు నిలిచారు. విజేతకు నగదు బహుమతి మొదటి విజేతకు రూ.5వేలు, రన్నర్‌కు రూ.3వేలు, మూడో స్థానానికి రూ.2 వేలు షీల్డ్‌ను అందజేశారు. క్లబ్ డైరెక్టర్ జాన్‌జాకబ్ రాజు, హనీఫ్ బ్యాడ్మింటన్ పేరెంట్స్ అసోసియేషన్ సీనియర్ బ్యాడ్మింటన్ ప్లేయర్లు కుమార్, ప్రకాష్, ఆనంద్, శేఖర్, రవి తదితరులు ఉన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేవే ముగ్గులు


బహుమతులు అందజేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ముగ్గులు మహిళల్లో సృజ నాత్మకతను వెలికితీస్తాయని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. వి.రాంభూపాల్ చౌదరి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు మామిదాల పాడులో ఆదివారం సంక్రాంతి పురస్కరించుకుని సంబరాలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు వై.రామేశ్వరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చారు. విజేతలకు నగర కమిషనర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు ఈ.మహేశ్వరరెడ్డి, ఎ.సాంబశివరావు, ఆదిత్యరెడ్డి, సురేంద్రగౌడు, కర్నూలు బాషా, ప్రసాద్, సుంకులమ్మ, మున్నాబాషా తదతరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రతి రూపమే ప్రియాంక గాంధీ


ప్రియాంక జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానీ ఇందిరా గాంధీ ప్రతి రూపమే ప్రియాంక గాంధీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, డీవీ సాంబశివుడు, ఎం శివానంద, షేక్ ఖాజా ఉస్సేన్, మల్లేశ్వరి, శ్రీలత, ప్రమీల, షేక్ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా

సి. బెళగల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా తప్పదని ఎస్ఐ తిమ్మారెడ్డి ద్విచక్ర వాహనదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. జరిమానా చెల్లించని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడిపితే లైసెన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గౌడు ఉన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

గూడూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె.రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు అన్నారు. ఆదివారం గూడూరులోని పడమర బీసీ కాలనీలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకునేందుకు కార్యకర్తలు, ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో టీడీపీ సభ్యత్వం పట్టణంలో దూసుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో రేమట వెంకటేశ్వర్లు, సృజన్, కౌన్సిలర్ కలాం బాషా, మన్సూర్ బాషా, చికెన్ వాహీద్, చాంద్ బాషా, చెంచుల విజయ్‌కుమార్, గిడ్డయ్య పాల్గొన్నారు.

● టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని టీడీపీ కౌన్సిలర్ రేమట సురేష్ అన్నారు. ఆదివారం టీడీపీ సభ్యత్వం నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పుట్టపాశం రామాంజనేయులు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డా.శరత్ చంద్ర విద్యార్థు లకు అనారోగ్య సమస్యలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా చలికాలంలో పాటించాల్సిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి, అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం

కర్నూలు న్యూసిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పారిశుధ్యం అందించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. కొత్తపేట, రాజ్‌విహార్ కూడలి తదితర ప్రాంతాల్లో కమిషనర్ పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను తప్పనిసరిగా నగర పాలక వాహనాలకే అప్పగించాలని మురు గు కాలువల్లో వేయవద్దని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విలువిద్య శిక్షణను సద్విని యోగం చేసుకోవాలని డా.వా సురెడ్డి అన్నారు. స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో విలువిద్య శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువిద్య మానవుడు వేటకు ఉపయోగించేవారని యుద్ధంలోనూ నవయుగ క్రీడల్లో ఉపయోగిస్తున్నారని అన్నారు. విలువిద్య వల్ల ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో విలువిద్య సంఘం కార్యదర్శి కాటేపోగు నాగరత్నమయ్య, చరణ్, బాలాజీ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.


విలువిద్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాసురెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


లద్దగిరిలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కోడుమూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో 1993-94 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గురువులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి గురువులు గోదాదేవి, బాబయ్య, వీరబ్రహ్మం, గిడ్డమూర్తిలపై పూలవర్షం కురిపిస్తూ వారికి ఆహ్వానం పలికారు. అనంతరం గురువులు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న చాలా మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. విద్యకు మించిన సంపద లేదని, చదువు అభివృద్ధికి సూచితమన్నారు. ఆపై విద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. గురువులను సన్మానం అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గిడ్డప్ప, జియర్, క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, రాజేశ్వరి, సువర్ణ పాల్గొన్నారు.

అప్పా హైస్కూల్‌లో..

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామ్ నగర్‌లోని ఎంహెచ్ అప్పా హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ హాజీ, షైఫర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కాసర్ల సురేష్, రమేష్, నాగమద్దిలేటి, శోభా, సరళ, అరుణ పాల్గొన్నారు.



శ్రీరామ్ నగర్‌లో గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆస్పరి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామకృష్ణ, మహేష్, అరవింద్ ఆదివారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ20,116లు, ద్వితీయ బహుమతి రూ.10,116లు, తృతీయ బహుమతిగా రూ.5,016లు ఇస్తామన్నారు. వివారలకు 9010788451 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

పెరవలిలో...

మద్దికెర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రంగనాథ ఆలయ ప్రాంగణంలో 13, 14 తేదీల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సాంబశివారెడ్డి

పత్తికొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని హోసూరు గ్రామంలో ఆదివారం రాయలసీమ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులు స్నేహపూర్వకంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు తెలుగు యువత నాయకులు సాయినాథ్ రెడ్డి, మణివర్ధన్ రెడ్డి, బనగాని రాజశేఖర్‌తో పాటు వాకిటి సాయి, రాఘవేంద్ర, పెద్దయ్య, బీజేపీ నాయకులు బ్రహ్మయ్య, జనసేన నాయకులు జయరాం పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీడీపీ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి

తుగ్గలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి కోరారు. ఆదివారం తుగ్గలిలో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ ఎస్టీలకు రుణాలు ఇచ్చారని, ఇప్పుడు కూడా ఇవ్వాలని అన్నారు. నిరుద్యోగులకు స్వయం ఉపాధికి కింద రుణాలు ఇస్తే చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతారని పేర్కొన్నారు. గిరిజన సంఘం నాయకులు మీటే తండా రాజు నాయక్, తిరుపాల్ నాయక్, ఏక్‌నాథ్ తదితరులు ఉన్నారు.

నలకదొడ్డిలో ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలకదొడ్డి గ్రామంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక పాఠశాల ఆవరణలో తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో కృష్ణవేణి, ద్వితీయ స్థానంలో పూజిత, మూడో స్థానంలో శ్రీలత, నాలుగో స్థానంలో సునీత నిలిచారు. వీరికి తెలుగు యువత నాయకుడు బత్తిన రాజశేఖర్, రఘు శేఖర్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎర్రిస్వామి, పెద్దరంగన్న, హరివర్ధన్, రవితేజ, దశరథ, రామలింగ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు భీమప్ప మృతి

ఆలూరు రూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహోతూరు గ్రామనికి చెందిన టీడీపీ నాయకుడు, కాంట్రాక్టర్ భీమప్ప చౌదరి(72) ఆదివారం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన పనిచేశారు. ఆయన ఆరోగ్యం విషమించడంతో బంధువులు బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భీమప్ప చౌదరికి భార్య ధనలక్ష్మి, కుమార్తెలు సమీర, సయుక్త ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ సంతాపం తెలిపారు. అలాగే టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, భీమప్ప చౌదరి మృతదేహానిని నివాళి అర్పించారు.



మెట్లపై నుంచి పడి మహిళ మృతి

మద్దికెర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన గంగన్నగారి లక్ష్మీదేవి (54) ఆదివారం మెట్లపై నుంచి జారిపడి మృతి చెందింది. వివరాలు.. ఇద్దరు కూతుళ్లకు వివాహమై వెళ్లిపోవడంతో భర్త నాగిరెడ్డితో కలిసి ఉంది. శనివారం సాయంత్రం మిద్దె ఎక్కేందుకు వెళ్లి, ప్రమాదవ శాత్తు జారి పడింది. ఇరుగుపొరుగువారి సాయంతో భర్త గుంతకల్లు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. భర్తఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ నాయక్ తెలిపారు.



లక్ష్మీదేవి (ఫైల్)

కూటమితోనే అభివృద్ధి

మద్దికెర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.లక్ష్మినారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మండలంలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. గొడుగు సతీష్ కుమార్, మీసేవా భీమరాజు ఉన్నారు.

వైసీపీ ఆలూరు కన్వీనర్‌గా మల్లికార్జున

ఆలూరు, జనవరి12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా కురవళ్లి గ్రామనికి చెందిన కురవ మల్లికార్జునను నియమించినట్లు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం తెలిపారు. ఇదివరకు ఔఉన్న చిన్న ఈరన్నను వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించిందన్నారు.

స్టేడియం.. పూర్తయ్యేదెన్నడు?

● మొండిగోడలకే పరిమితమైన ఇండోర్ స్టేడియం ● 2018లో టీడీపీ హయాంలో మొదలు ● బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం



పట్టణంలోని విట్టా కిష్టప్ప నగర్‌లో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం పట్టణంలోరూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆర్టీసీ బస్టాండ్ వెనుక విట్టా కిష్టప్ప నగర్‌లో జిల్లా క్రీడా ప్రాధికారక సంస్థ 2017-18లో ఎన్టీఆర్ క్రీడా వికాస్ కేంద్రం ఇండోర్ స్టేడియం నిర్మాణా నికి 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు.

మొండిగోడలకే పరిమితం

దాదాపు ఐదేళ్ల నుంచి మొండి గోడలకే పరిమితమైంది. ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పడలేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం స్పందించి పనులను ప్రారంభించి పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతు న్నారు. ఈ విషయమై శ్యాప్ అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వం మారడంతో..

22018లో స్టేడియం పనులు వేగంగా సాగాయి. 60 శాతంపైగా పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ రూ.50 లక్షలపైగానే పనులు చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో బిల్లులు చెల్లించలేదు, దీంతో పనులు ఆగిపోయాయి. బిల్లులు ఆపేసింది. కాంట్రాక్టర్ చేతులెత్తేసి, పనులను నిలిపివేశారు. సాధన చేసేందుకు స్టేడియం లేక తాము ఇబ్బంది పడుతున్నామని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి, నిధులు మంజూరు చేసి స్టేడియం నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



ఆదోని నుంచి ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా రాణిస్తున్నారు. స్టేడియం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇండోర్ స్టేడియం పనులను ప్రారంబించి పూర్తి చేయాలి. - **షబ్బీర్ అహ్మద్, క్రీడాకారుడు**

ప్రభుత్వం స్పందించాలి



2018 లో రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం పనులను ప్రారంభమయ్యాయి. ఐదేళ్లుగా పనులు సాగకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహంతో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి పనులు మొదలుపెట్టాలి.
- **శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు**

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్



పెద్దహోతూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు రూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం పెద్దహోతూరు గ్రామంలో చిన్న యాదవ్‌కు చెందిన గోకులం షేడ్‌ను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మించి పశువులకు నీడ కల్పించిందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చాక సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వ నిర్మాణం, తాగునీటి ట్యాంకులు నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిధులు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జొహాపురం కురవ వీరేశ్ ఏపీవో శ్రీనివాసులు, కురవ లక్ష్మన్న, ఎంపీటీసీ చిన్న యాదవ్ ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడు నగరడోణ కృష్ణప్ప, విద్యా కమిటీ చైర్మన్ కెకెడీ. టీడీపీ సీనియర్ నాయకులు రామదుర్గం తిమ్మయ్య పాల్గొన్నారు.

దేవనకొండ: గోకులం షెడ్లతో పశు సంపద అభివృద్ధి చెందుతుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో గోకులం షెడ్‌ను ప్రారంబించారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంద న్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంద న్నారు. ఏడీఏ పక్కీరప్ప, టీడీపీ నాయకులు బడిగెంజల రంగన్న, ఆకుల సిద్ధ, మల్లికార్జున, మలకన్న, సర్పంచ్ భాస్కర్, మహేశ్వర్‌రెడ్డి, మాల బండ్లయ్య, వీరేష్, శీను, ఏపీఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య

దేవనకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.మధు, ఎ.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక టర్నింగ్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. పోలీసులు, ఆర్టీఏ అధికారులు చలానాలు వేస్తూ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. జీవో 21, 31ను తక్షణమే రద్దు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు, బ్యాంకుల్లో రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గణేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.నరసారావులు, ఆటో వర్కర్స్ యూనియన్ మండల మహాసభ నాయకులు షేక్ బడేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోని టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ ప్రాంగణాల్లోని నిరాశ్రయులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ, పదేళ్లుగా నిరాశ్రయులు, చలికాలంలో దుప్పట్ల పంపిణీ చేస్తున్నామన్నారు. క్లబ్ చైర్మన్ ప్రసాద రావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, విశిష్ట సభ్యుడు ఓం ప్రకాష్, వన్నప్పరాజు, లియో క్లబ్ మాస్టర్ అద్వైత్ పాల్గొన్నారు.

యువజన ఉత్సవాలు

ఆదోని టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో యువజన వారోత్సవాల్లో భాగంగా జిహ్వేశ్వర పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు విట్టా రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. ఈ నెల 23 వరకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తామని యువ మోర్చా జిల్లా కార్యదర్శి అంజయ్ కుమార్ తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, వెల్లాల మధుసూదన్ శర్మ, కౌన్సిలర్ సురేష్, మహదేవ, నాగార్జున, మణికంఠ, శ్రీకాంత్, శివ, కిరణ్ పాల్గొన్నారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

తుగ్గలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ సూచిం చారు. ఆదివారం తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగా హన కల్పించారు. బ్యాంకు, కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని బంపర్ ఆఫర్ వచ్చిందని ఓటీపీలు చెప్పాలని ఫోన్‌చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే యువత దురలవాట్లకు బానిత కావొద్దని, జూదాలకు పాల్పడకూడదన్నారు. ఆన్‌లైన్ గేములతో నష్టపోవద్దని సూచించారు. తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, జయ శేఖర్ ఉన్నారు.

రేపు భజన పోటీలు

మద్దికెర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో ఈ నెల 14న సంక్రాంతి సందర్భంగా భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వీరయ్య తెలిపారు. స్థానికులు అవకాశం లేదని, ఆధార్ కార్డు తప్పనిసరి అన్నారు. రూ.300లు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని 9908620946, 9705558717 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

క్రిష్ణగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ డీఈ శేషయ్య హెచ్చరించారు. ఆదివారం అమకతాడు, కర్లకుంట, పెనుమాడ, కోయిలకొండ, పెద్దొడ్డి, చిట్యాల, ఆలంకొండ, బోయ బొంతిరాళ్ళ గ్రామాల్లో సీసీ రోడ్లను పరిశీలించారు. ఏఈ జాకీర్ హుసేన్ ఉన్నారు.

శనగ రైతులను ఆదుకోవాలి

మద్దికెర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శనగ రైతులను ఆదుకోవాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం అధ్యక్షుడు మదనంతపురం హనుమన్న డిమాండ్ చేశారు. ఆదివారం శనగ పంటను పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో ఎకరాకు 3 క్వింటాళ్లు కూడా రాదన్నారు. వ్యవసాయాధికారులు పరిశీలించాలని, ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే కందులు దిగుబడి ఆశాజనకంగా ఉన్నా, ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు చేయఏదన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు



ఉపాధ్యాయులతో సెయింట్ అంథోని పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ అంథోని ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని తమ స్నేహితులను చూసి పులకించిపోయారు. తరగతి గదిలో ఆనాడు చేసిన అల్లర్లను, మధుర జ్ఞాపకాలను తలచుకు న్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాదర్ జాన్ డేవిడ్, ఫాదర్ ప్రసన్న, పాదర్ ఇన్నారెడ్డి, హెచ్‌ఎం కేశవయ్య విశ్రాంత హెచ్‌ఎం ఎల్‌కే చిన్నప్ప, ఉపాధ్యాయులు లక్ష్మణ, నరసన్న, భారతి, శామ్యూల్ పూర్వవిద్యార్థులు వేదవ్యాస్, రాజశేఖర్, ఆదినారాయణ, లింగప్ప వీరప్రతాప్, రామాంజి, వీరేంద్ర, లక్ష్మీ, రోజా, ధనలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు.

పాడి రైతులకు అండ

చిప్పగిరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీటీసీ రజిని అన్నారు. ఆదివారం రూ.1.85 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్‌ను సర్పంచ్ గోవింద్‌రాజులుతో కలసి ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం గోకులం షెడ్లను నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. రైతు, ఎల్లంకి ప్రసాద్, టీడీపీ నాయకులు పోతురాజు రాముడు, రామాంజినేయులు, ఏపీవో జుబేర్ అహ్మద్, టీఏ మూర్తి పాల్గొన్నారు.



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న రజని

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఆదోనిలో నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. నాగరాజు, భారత్ కుమార్, సంజయ్, వెంకట్, సంతోష్ ఉత్తేజ్, రవితేజ, వెంకటేశులు, సతీష్ కుమార్, పవన్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. మైన, గిరిమూరి అమరేశ, ఉరుకుందు, గోపాల్, జోగేంద్ర, తిరుమల, మధు పాల్గొన్నారు.

ఆలూరు: వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని యూటీఎఫ్ కౌన్సిలర్ ఖాసిం అన్నారు. ఆదివారం కోయనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నివాళి అర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గోవిందప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, బసవరాజు, సుధ, శేఖర్, నాయకులు చంద్రశేఖర్ నాయుడు, ఉరుకుందు, శేఖర్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ వ్యవస్థాపకుడికి నివాళులు

యూటీఎఫ్ వ్యవస్థాపకులలో ఒకరైన మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా యూటీఎఫ్ నాయకులు నివాళి అర్పించారు.

పత్తికొండ టౌన్: పట్టణంలో ఆదివారం వివేకానంద జయంతి నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి బీజేపీ నాయకులు గోవర్ధన్ నాయుడు, దండి మల్లికార్జున, గోరంట్ల, కరణం చంద్ర, కరణం నరేష్, శంకరయ్య, బీజేపీ జిల్లా కళాకారుల సంఘం కన్వీనర్ రామ్మోహన్ నివాళి అర్పించారు. అలాగే బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి ఆధ్వర్యంలో న్యాయవాదులు మల్లికార్జున, వాసుదేవ నాయుడు, రాజశేఖర్ నాయుడు, నరసింహాచారి నివాళి అర్పించారు.

చెరువును కాపాడండి

ఆలూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆలూరు చెరువు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు పి హనుమంతు, నాయకులు కృష్ణ, మైన, ఈరన్న డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం బృందం చెరువును పరిశీలించింది. 155.73 ఎకరాల చెరువును కబ్జాదారుల నుంచి రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ప్రజా సంఘాల పోరాటాలతో నిలిపివేసినా, ఇటీవల అధికార పార్టీ నాయకులు మళ్లీ సరిహద్దు రాళ్లు పెట్టి ఆక్రమించడాన్ని ఖండించారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు సర్వే చేయించి, చర్యలు తీసుకోవాలన్నారు.



పట్టణంలోని పాత బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక రహదారిలో చెత్త, చెదారంతో దుర్వాసన వస్తోంది. కుళ్లిపోయిన కూరగాయాలు వేస్తుండటంతో పందులు చేరాయి. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - **ఆలూరు**

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● వెలుగు ఏపీఎం సరసన్న



దేవనకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు ఇస్తున్నామని వెలుగు ఇన్‌చార్జి ఏపీఎం నరసన్న అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని పొదుపు సంఘాలు ,గ్రామైక్య సంఘాలు ఉన్నాయి?

జవాబు: మండలంలోని 44 గ్రామాల్లో 1,546 పొదుపు సంఘాలుండగా, 16,450 మంది సభ్యులు ఉన్నారు. అలాగే 54 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి.

ప్రశ్న: బ్యాంకు లింకేజీ ద్వారా ఎన్ని రుణాలు ఇచ్చారు?

జవాబు: ఈ ఏడాది లక్ష్యం రూ.29.76 కోట్లు కాగా, డిసెంబరు నాటికి రూ.19.78 కోట్ల రుణాలు ఇచ్చాం. సభ్యులు 98 శాతం తిరిగి చెల్లించారు.

ప్రశ్న: స్త్రీనిధి రుణాల లక్ష్యం ?

జవాబు: రూ.3.50 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటి వరకు 252 మంది సభ్యులకు రూ.1.43కోట్లు ఇచ్చాము. పొదుపు సంఘం రూ.7200 డిపాజిట్ చేస్తే, స్త్రీనిధి ద్వారా రూ.5లక్షల వరకు రూపాయి వడ్డీతో రుణం తీసుకోవచ్చు. అయితే పొదుపు సంఘం రెగ్యుల ర్‌గా ఉండాలి. జీవనోపాధుల మెరుగుకే స్త్రీనిధి రుణాలు ఇస్తాం.

ప్రశ్న: ఉన్నతి రుణాలు ఏవరికి ఇస్తారు?

జవాబు: ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఉన్నతి రుణాలు ఇస్తాం. సంఘానికి రూ.5 లక్షల చొప్పున వడ్డీలేని రుణం ఇస్తాం. మండలంలో రూ.2.25 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 275 మంది పొదుపు సభ్యులకు రూ.1.25కోట్ల రుణాలు ఇచ్చాము. రుణాలను సక్రమంగా చెల్లించకుంటే జరిమాన విధిస్తాం.

ప్రశ్న: రైతు, గొర్రెల సంఘాల వివరాలు?

జవాబు: 198 రైతు సంఘాలు, గొర్రెల సంఘాలు 98 ఉన్నాయి. రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు సబ్సిడీ విత్తనాలు ఇస్తాం. గొర్రెల పెంపకందారులకు రూపాయి వడ్డీతో రుణాలు ఇస్తాం. పట్టెళ్లు, దాణా ఇస్తాం.

హంద్రీ నీవా నుంచి నీరు విడుదల చేయాలి

● కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బీవీ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా ప్రధాన కాలువ నుంచి మూడు టీఎంసీల నీటిని 392 క్యూసెక్కుల సామర్థ్యంతో విడుదల చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. ఆదివారం కర్నూలులో కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 82 ప్రకారం హంద్రీనీవా నుంచి మూడు టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఉందన్నారు. అయితే ఏడాదికి కేవలం 0.40 టీఎంల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారని దీంతో 200 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుందన్నారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో 2.12టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉందన్నారు. దీంతో తాగునీటి, సాగునీటి అవసరాలకు సమస్యగా మారుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని హంద్రీనీవా ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టుకు తక్షణమే 392 క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని విడుదల చేయాలని కోరారు.

మోసపూరిత మాటలతో కాలయాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మంత్రాలయం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను పట్టించుకోకుండా మోసపూరిత మాటలతో కాలయాపన చేస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజు అన్నారు. ఆదివారం స్థానిక బీసీ హాస్టల్‌లో ఏఐవైఎఫ్ మండల సమావేశం తాలుకా అధ్యక్షుడు జాఫర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల దాకా ఉద్యోగాలను భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చి 11 ఏళ్లయినా ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపించారు. మెగా డీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్వహించాలని, లేకపోతే ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

● ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక:

ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న, ఉపాధ్యక్షులుగా విజయ్, జర్మియా, ప్రధాన కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శులుగా వినేష్, థామస్, శ్రీదర్‌లను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, ఏఐవైఎఫ్ నాయకులు జీవన్, నరసింహులు, బాషా, ఈరన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గోనెగండ్లలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని, శారీరక వికాసాన్ని ఇస్తాయని సీఐ గంగాధర్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను సీఐ గంగాధర్ ప్రారంభించారు. గ్రామ ఎంప్లాయిస్, రైజింగ్ స్టార్ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ క్రికెట్ పోటీలకు మండలంలోని పలు గ్రామాల నుంచి క్రీడాకారులు వచ్చారు. కార్యక్రమంలో మనోజ్, కళ్యాణ్, ఖజా, వేణు పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం



మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మఠం అధికారులు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషిలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

అన్నదానానికి రూ. 2.48 లక్షల విరాళం

మంత్రాలయం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ముగ్గురు అజ్ఞాత భక్తులు రూ.2.48 లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్‌జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి శ్రీమఠం పండితులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

జూదమాడితే చర్యలు

మంత్రాలయం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, పేకాట, పొట్టేళ్ల ఆటలు వంటి జూదాలకు పాల్పడితే చర్యలు తప్పవని మంత్రాలయం సీఐ రామాంజులు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయం సర్కిల్ పరిధిలో సంక్రాంతి పండుగను భక్తిశ్రద్ధలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. పండుగ పేరుతో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. జూదం, పేకాట ఆడినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేసి శిక్షలు ఉంటాయన్నారు. పండుగలకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు విలువైన వస్తువులు డబ్బులు, నగలు, బంగారు సురక్షితంగా ఉంచుకోవాలని, అలా వెళితే.. పోలీసులకు సమాచారం ఇస్తే దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



ఎమ్మిగనూరులో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



నందవరంలో నిర్వహించిన వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మహేష్ జిల్లా నాయకులు సురేష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని యువతి, యువకులు స్నేహ భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, ఉదయ్, ప్రకాష్, గిరి, గణేష్, చరణ్, అశ్వంత్, దీపాక్, మోహిన్, భార్గవ్, చిన్న పాల్గొన్నారు.



వివేకానందుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కౌతాళం: మండలంలో స్వామి వివేకానంద జన్మదినాన్ని విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు మారుతి మోహన్, టీడీపీ రైతు విభాగపు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు పాల్గొన్నారు.

నందవర: నందవరంలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మఠం రాజశేఖర్‌స్వామి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు బారత జాతి యొక్క సనాతన ధర్మాన్ని, యువకులకు ఆత్మాస్థైర్యాన్ని నింపిన బోధనలు గుర్తు చేశారు. కార్యక్రమంలో అయ్యపురెడ్డి, గవ్వల నారాయణ, చంద్రగౌడు, తిమ్మప్ప, వీరేష్, చిన్న బీమన్న, ఈరన్న, దస్తగిరి, మల్లి, నరసింహ, చలపతి, మహేష్ పాల్గొన్నారు.

జంప్డ్ డిపాజిట్ పేరుతో కొత్త మోసం

- సైబర్ నేరగాళ్ల కొత్త తరహా స్కామ్ - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా స్కామ్‌లకు పాల్పడుతున్నారని అందులో భాగంగానే తాజాగా జంప్డ్ డిపాజిట్ స్కామ్ పేరుతో కొత్త మోసం వెలుగులోకి వచ్చిందని సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ దీని ద్వారా చాలా మంది ప్రజలు భారీగా డబ్బును కోల్పోతున్నారని ఆయన అన్నారు. జంప్డ్ డిపాజిట్ స్కామ్ అనేది యూపీఐ వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని వల పన్నుతున్నారన్నారు. నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లో రూ. 5వేలు లేదా అంతకంటే ఎక్కువ జమ చేస్తారన్నారు. ఖాతాలో డబ్బు జమ అయినట్లు ఒక నోటిఫికేషన్ ఎస్ఎంఎస్ రూపంలో ఖాతాదారుడికి వస్తుంది. ఆ సమయంలో ఖాతాదారుడు బ్యాలెన్స్ చెక్ చేయడానికి యూపీఐ ఓపెన్ చేసి పిన్ నెంబర్ ఎంటర్ చేస్తే నేరగాడికి యాక్సెస్ లభిస్తుంది. దీంతో ఖాతాలో ఉన్న మొత్తం డబ్బు మాయమైపోతుంది.

స్కామ్‌ను ఎదుర్కోవడం ఇలా:

గుర్తు తెలియని నెంబర్ నుంచి మీ ఖాతాలో చిన్నమొత్తం జమ అయితే వెంటనే బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేయరాదు. 15 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకు వేచి చూడాలి. ఆ తరువాత స్కామర్ అభ్యర్థి గడువు ముగిసిపోతుంది. ఒకవేళ మీ ఖాతాలో డబ్బు జమ అయిన తరువాత బ్యాలెన్స్ చెక్ చేసుకునే సమయంలో ఉద్దేశపూర్వకంగానే తప్పు పిన్ ఎంటర్ చేయాలి. దీంతో స్కామర్ అభ్యర్థన క్యాన్సిల్ అవుతుంది. బ్యాంక్ బ్యాలెన్స్‌కు సంబంధించిన యాప్ నోటిఫికేషన్ లేదా మెసేజ్‌లు వస్తే మీరు నేరుగా బ్యాంక్‌ను సంప్రదించి అనుమానాలను తీర్చుకోవాలి. ఇతరులకు యూపీఐ పిన్ నెంబరు చెప్పడం లేదా షేర్ చేయడం వంటివి చేయరాదు. జంప్డ్ డిపాజిట్ స్కామ్‌కు సంబంధించిన కేసులు ఇటీవల చాలా ఎక్కువయ్యాయి. ఇలాంటి తరహా మోసాలను గుర్తించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

26 ఏళ్ల తర్వాత నరహరి తీర్థులకు తొలి పూజ

● నరహరితీర్థుల బృందావనానికి మహా కుంభాభిషేకం చేసిన పీఠాధిపతి
● వందలాదిగా తరలివెళ్లిన మఠం శిష్యులు, భక్తులు
● ఈ విజయం రాఘవేంద్రస్వామి శిష్యులకే అంకితం



నరహరితీర్థుల అభిషేక తీర్థాన్ని భక్తులకు పంచుతున్న పీఠాధిపతి



నరహరితీర్థ బృందావనం వద్ద పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మధ్వాచార్యుల ప్రథమ శిష్యుడు నరహరితీర్థుల బృందావనానికి మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. 26 ఏళ్ల తర్వాత తొలి పూజను మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం శిష్యులు, భక్తులు, షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు తరలివెళ్లి పూజలు నిర్వహించారు. కర్ణాటకలోని హంపీ, తుంగభద్ర నదిలో మధ్యలో వెలసిన నరహరితీర్థుల బృందావనానికి ఆదివారం వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయధ్వనుల మధ్య కుంభాభిషేకం, మహా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పీఠాధిపతులు శ్రీమఠం శిష్యులందరికీ అంకితమని, మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకించి అన్నసంతర్పణ చేశారు. ఈ బృందావనాన్ని 1998లో అప్పటి పీఠాధిపతి శ్రీ సుశమీంద్రతీర్థులు నిర్మించారు. అయితే ఉత్తరాధిమఠం, మంత్రాలయం మఠానికి పూజ హక్కులు లేవని కోర్టులో ఇంజక్షన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. 1998 నుంచి 2025 వరకు మంత్రాలయం మఠం తరపున ఉత్తర ప్రత్యుత్తరాలు ఇవ్వడం, కింద కోర్టులు కొట్టివేయడం జరుగుతూ వచ్చింది. గత రెండు రోజుల క్రితం ధార్వాడ హైకోర్టు నరహరి తీర్థులు బృందావనానికి మంత్రాలయం మఠం పూజలు చేసుకునేందుకు ఉత్తర్వులు ఇవ్వడంతో ఆదివారం మంత్రాలయం నుంచి వందలాది మంది భక్తులు తరలివెళ్లి అక్కడ పూజలు చేశారు. కార్యక్రమంలో వాదిరాజాచార్, రమణారావు, భీమసేనాచార్, వేణుగోపాలాచార్, శ్రీకాంతాచార్, కరణం వెంకటేషాచార్, కనకాచల వడియార్, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవి కులకర్ణి, బద్రినాథ్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, జనార్దన్ రెడ్డి, గోరుకల్లు కృష్ణ, పరమేష్, శాంతయ్య, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం సత్యనారాయణ మూర్తి



నందవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం ఏఈ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: జలజీవన్ మిషన్‌తో తాగునీటి సమస్య తీరుతుందా?

జవాబు: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన ఈ జలజీవన్ మిషన్ పనులతో తాగునీటి సమస్య తీరుతుంది.

ప్ర:శ్న: మండలానికి జలజీవన్ మిషన్ కింద ఎంత నిధులు వచ్చాయి?

జవాబు: మండలానికి రూ. 12.50 కోట్ల మంజరైయ్యాయి. అయితే ఆ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కాని మండల కేంద్రమైన నందవరంలో మాత్రం విజయవాడకు చెందిన కాంట్రాక్టర్ ముందకు వచ్చారు. టెండర్ దక్కించుకుని రూ.కోటి 15లక్షలతో జలజీవన్ మిషన్ కింద తాగునీటి పనులు చేశారు.

ప్రశ్న: గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చే పథకాలు ఏవి?

జవాబు: మండలంలోని 10 గ్రామాల్లో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా తాగునీరు వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందిలేదు. అందులో నందవరం, నాగలదిన్నె, రాయచోటి, గురుజాల, మిట్టాసోమాపురం, కనకవీడు, పేట, పూలచింత గ్రామాలకు తాగునీరు అందుతుంది.

ప్రశ్న: మండలంలో తాగునీటి ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి పరిస్థితి ఏమిటి?

జవాబు: శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్‌లు లేవు, ప్రతి ట్యాంక్‌కు 30 ఏళ్ల లైఫ్ ఉంటుంది. ఇంకా ఐదు ఏళ్ల ట్యాంకులు భద్రంగానే ఉంటాయి.

ప్రశ్న: మండలంలో ఎన్ని చేతి బోర్లు ఉన్నాయి?

జవాబు: మండలంలో 175 బోర్లు ఉన్నాయి. అందులో 130 బోర్లు పని చేస్తున్నాయి. మిగతా వాటికి ఎంపీడీవో వర్కర్‌ను పెట్టి రిపేరి పనులు చేయిస్తూ నీటి సమస్య లేకుండా చూస్తారు.

ప్రశ్న: మండలంలో పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ నీటి పథకాలు ఏఏ గ్రామాల్లో ఉన్నాయి?

జవాబు: అన్ని గ్రామాల్లో ఈ పథకాలు ఉన్నాయి. చెడిపోతే వాటి నిర్వహణ సర్పంచులు చూసుకుంటారు. మరమ్మతులు చేసి ఇబ్బందిలేకుండా చూస్తారు. వాటిపై మా పర్యవేక్షణ ఉంటుంది.

ప్రశ్న: నాగలదిన్నె వరద కాలనీకి తాగునీరు అందుతుందా?

జవాబు: చిన్నకొత్తిలి స్కీం ద్వారా పైపులైన్లతో, అలాగే నాగలదిన్నె స్కీం నుంచి తాగునీరు వస్తుంది. ప్రస్తుతానికి ప్రజలకు తాగునీటి ఇబ్బందే లేదు.

సేవ్ నేచర్ సేవ్ వాటర్

- గోనెగండ్లకు చేరిన పాదయాత్ర



గోనెగండ్లకు చేరుకున్న సుమంత్ అశ్విన్

గోనెగండ్ల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సేవ్‌నేచర్, సేవ్‌వాటర్ నినాదంతో భారతదేశం మొత్తం పాదయాత్ర నిర్వహిస్తున్న సుమంత్ అశ్విన్ అన్నారు. ఆదివారం పాదయాత్ర గోనెగండ్లకు చేరుకున్నారు. ఈ యువకుడు ప్రజలు ఎక్కువగా ఉన్న చోట ప్రకృతిని, నీటిని కాపాడుకోవడం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ సాగుతున్నాడు. సుమంత్ అశ్విన్ కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన వారు. పాదయాత్ర ద్వారా భారతదేశమంతా తిరిగి ప్రకృతి, నీరు గొప్పతనాన్ని ప్రజలకు వివరించాలని గత ఏడాది జూన్ 2న కోలార్ జిల్లా వర్తూర్ నుంచి పాదయాత్ర మొదలు పెట్టినట్లు తెలిపారు. రోజుకు 21 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ ఇప్పటికి 700 కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లు ఆయన తెలిపారు. గత రెండు రోజుల క్రితం మంత్రాలయం చేరుకొని గోనెగండ్ల మీదుగా కర్నూలు కడప చేరుకొని అక్కడి నుంచి తిరుపతి చేరి చెన్నై చేరుకుంటానని తెలిపారు. దారి వెంట దాతలు ఇచ్చే డబ్బుతో తన ఖర్చులు జరుపుకుంటున్నానని తెలిపారు. పాదయాత్ర మరో రెండేళ్ల పడుతుందని అన్నారు. విషయం తెలుసుకున్న గోనెగండ్ల యువకులు సమంత్ అశ్విన్‌కు సాదరంగా ఆహ్వానించి సాగనంపారు.

గోకులం షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



చౌలహల్లిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంత్రాలయం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చౌలహల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్డును ఆదివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రారంభించారు. అనంతరం పశువులకు ఆహారం పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ లోకేశ్వర్, ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతి దేవి, పశువైద్యాధికారి సురేఖ, ఏపీవో తిమ్మారెడ్డి, నాయకులు గురెడ్డి భీమిరెడ్డి, సీవీ విశ్వనాథరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, సుధాకర్‌రెడ్డి సాయినాథరెడ్డి, జయరామిరెడ్డి, విజయరామిరెడ్డి, రాఘవేణమ్మ, నరసింహారెడ్డి, ఎంపీటీసీ ఈరన్న, బొజ్జప్ప, పెద్దరంగన్న, ఈసి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవ చేయడమే ప్రభుత్వ లక్ష్యం



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న రాఘవేంద్రరెడ్డి, అధికారులు

మంత్రాలయం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. గోవులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల క్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గోకులం షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, వరద రాజు, ఎస్ఎం గోపాల్‌రెడ్డి, లక్ష్మన్న, ఏపీడీ లోకేశ్వర, ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, ఏపీవో తిమ్మారెడ్డి, పశువైద్యాధికారి అశోక్ కుమార్, ఎస్ఐ పరమేష్ నాయక్, భీమిరెడ్డి, కేశన్న, నాగరాజు, టీఏలు మరుధ్వతి, రఘువీర్ నాయుడు, దేవేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకుంటున్న గ్రామస్థులు

మంత్రాలయం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చౌలహల్లి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఆదివారం గ్రామంలో గోకులం షెడ్డు ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి గ్రామస్థులు సమస్యలు వివరించారు. మురుగు శుభ్రం చేసేవారు లేరని, రోడ్లు లేవు.. లైట్లు లేవన్నారు. సర్పంచ్ పత్తా లేకుండా పోయారని ఆరోపించారు. త్వరలో సర్పంచుతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట గురెడ్డి భీమిరెడ్డి, సీవీ విశ్వనాథరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ ఈరన్న, సుధాకర్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

శివారెడ్డిగౌడుకి సన్మానం



శివారెడ్డిగౌడును సన్మానిస్తున్న నాయకులు

నందవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డి గౌడును నాయకులు, కార్యకర్తలు ఆదివారం సన్మానించారు. పార్టీకి విధేయుడుగా ఉంటానని శివారెడ్డిగౌడు చెప్పారు. కార్యక్రమంలో ముగతి ఎంపీటీసీ పురుషోత్తంరెడ్డి, సోమలగూడురు వెంకటేశ్వరరెడ్డి, పూలచింత సురేష్‌గౌడు, యల్లాగౌడు, రమేషప్పగౌడు, మాచాపురం సర్పంచ్ కోటేశ్వరరావు, ముని, చెన్నబసవ పాల్గొన్నారు.

కార్యకర్త మృతి టీడీపీకి తీరని లోటు



పక్కీరప్ప మృతదేహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దకడుబూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త, మాజీ డీలర్ పక్కీరప్ప మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దకడబూరు గ్రామంలో అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త పక్కీరప్ప మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, యంజీ నరసన్న, తలారి ఆంజి, బొగ్గుల నరసన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.